# పునర్నవం



సాయంత్రం స్కూల్నించి ఇంటి కొచ్చి పక్కింట్లో ఇచ్చిన బాబును తెచ్చుకుని, వానికేం కావాలో కనుక్కుని, తరవాత తన కింత తిండి తయారు చేసుకునే ప్రయత్నంలో పడుతుండే అప్పుడు రోజంతా కనిపించని బాధ కదులుతుంది సత్యవతి మనస్సులో. ఆ నిశ్శబ్దంలో, నిశ్శబ్దంలో తన హృదయాన్ని కోస్తున్న రంపపుకోత తన చెవులకు సన్నగా అయినా, భయంకరంగా వినిపిస్తున్నట్లనిపిస్తుంది. బయటి ప్రపంచంతో సంబంధం పెట్టుకుని వ్యాకోచం చెందినప్పుడు ఈ ప్రపంచ కోలాహలంలో అది వినిపించదు. ఆ రోజుకు ప్రపంచంతో తన సంబంధం పరిమితం చేసుకుంటూ తనుగా మిగిలిన ఆ దగ్గరితనంలో తన లోపలి ధ్వని వినపడుతుంది. లేకపోతే ఉదయం స్కూలుకు వెళ్ళే హడావుడిలోనూ, స్కూల్లో పిల్లలతో ఉన్నప్పుడూ, ఆఖరికి రాత్రికి ఒంటిగా...అవును అప్పుడు కూడా ఇట్లాంటి బాధ ఉండదు. అపుడు బాబు తనను తాకుతూ తన పక్కలో ఉంటాడు. అప్పుడెప్పుడైనా గతం కమ్ముకుంటుంది తనను. ఆ గతం మబ్బు కింద, జరీ అంచులా చుట్టూ బాబు మెరుస్తూంటాడు. వాణ్ణే తన చేయి చుట్టుకుని ఉంటుంది. ఇప్పుడెందుకనో అట్లా ఉండదు. ఇపుడు మనసు

పెరట్లో కొబ్బరిచెట్టు చంద్రుడి మొహం మీద కత్తులు ఝుళిపిస్తోంది. సిగరెట్ పొగ హంసలా వెన్నెల సరస్సులో ఈదుతోంది.

సత్యవతి భోజనం చేయలేక పోయింది. కనీసం చంద్రకూడా తన పట్ల సానుభూతి చూపలేదు. పైగా హేళన చేస్తున్నాడు. పుట్టింటినీ, అత్తింటినీ విడిచి వచ్చి ఇక్కడ స్కూల్లో పంతులమ్మగా రెండు వందల జీతంతో సాగే తన జీవితం సంగతి అతని కవసరం లేదు. అతని కెందుకు? డాక్టరైనాడు. అర లక్ష, లక్ష పట్టుకుని అందమైన పెళ్ళా మొస్తుంది. అంతే...అంతే! లేకపోతే దైవికంగా తాకిన దెబ్బ సంగతి పోనీ, అందు కేం చెయ్యలేడు సరే! అటూ ఇటూ అయిన వాళ్ళు చేసిన గాయాన్ని గురించయినా పరామర్శచెయ్యడూ? చేస్తే లేని పోని బెడద తెచ్చుకొన్నట్లవుతుందని సచివ్‌గా ఉన్నాడు గావాల. అవున్లే, తండ్రి సంపాదిస్తుంటే కొడుకుమాత్రం అడ్డం పడతాడా? అయితే, చంద్రకూడా అంతేనా! అట్లాంటి వాడేనా? అయితే, అట్లాంటివాడు మరిప్పు డెందు కొచ్చినట్లు? తనకు మాత్రం అభిమాన ముందనుకోవాలనేమో? అబ్బ! ఏమో తెలీదు. ఎందుకో వచ్చాడు, పోతాడు. తనకు తన ఒంటరితనం, ఒంటరి జీవితం తప్పదు. కరుగుతూన్న రాయి మళ్ళీ కరుడు గట్టింది. కింద తనకూ, బాబుకూ పక్క పరిచి అందులో బాబును మెల్లగా పడుకోబెట్టి, మంచం తెచ్చి బయట వేసింది.

"బాబూ, నువ్వూ కింద పడుకోట మెందుకూ? నేనే పడుకునేవాణ్ణిగా?"

మాట్లాడకుండా దుప్పటి పరిచి, మరోటి తలగడగా ఉంచి లోపలికి పోయింది. బాబును అదిమి పట్టుకుని కళ్ళు మూసుకున్న సత్యవతి, కళ్ళమీద తాకిన ఏదో ఒత్తిడికి కళ్ళు తెరిచింది.

"అప్పుడే నిద్ర పోయినట్లుందే!" అని నవ్వాడు. ఆమె అటే చూస్తోంది అయోమయంగా.

"నేను... కాదు, మనం కొంచెం మాట్లాడుకోవాలి" అని చూశాడు.

మాట తడబడుతున్నా లోపలి అర్థం, చూపులూ స్థిరంగా ఉన్నట్లున్నాయి. గిరుక్కున వెనక్కి తిరిగి గబగబా లత నుంచి తెంచి ఏదో అందుకుని వచ్చాడు. అత నట్లా దగ్గరగా నిలబడి ఉంటే పడుకోలేక లేచి కూర్చుంది సత్యవతి. హఠాత్తుగా, ఎదురుగా గొంతు క్కూర్చున్నా డతను. అతని రెండు చేతుల్లో ఏముందో చూడటం కంటే ముందు అతని ముఖం ఆమె చూపును లాక్కుంది.

"సత్యవతీ! ఇవి నీ కని తెచ్చాను." ఒళ్ళో పడిన పొట్లం కేసి చూసింది. తామరాకులో కట్టిన మల్లె పూలు! "చంద్రా!" నోరు తెరుచుకుని ఆశ్చర్యంగా చూసింది. అతని పెదాల మీద నవ్వుం పూలు!

"ఏమనుకున్నావు నన్ను? ఇందుకా నువ్వు వచ్చింది? ఇప్పుడు తెలిసింది... ఇప్పుడు తెలిసింది. తెలిసింది." వత్తి పలికిన ప్రతి మాట మాటకూ మధ్య ఉద్రేకం అంచెలంచెలుగా పెరిగింది. ఆ పెరిగిన స్థాయినించీ ఉద్రేకం హఠాత్తుగా దుఃఖంగామారి, జలపాతంలా హోరున దూకింది. బాబు ఉలిక్కి పడి లేచి, ఏడుపు అందుకున్నాడు, చంద్ర నోరు తెరిచి చెప్పాలనుకున్నదానికి అవకాశం లేకుండా. పిచ్చిదానిలా తల బాదుకుంటున్నది సత్యవతి.

"సత్యవతీ! బాబును సముదాయించు. నేను తరవాత మాట్లాడతాను."

"వద్దు... వద్దు... నువ్వేం మాట్లాడద్దు. పో... బయటికి!" అరిచింది.

చంద్ర [illegible] బయటికి వెళ్ళిపోయాడు. బాబు ఏడుపు పోగొట్టడానికి, తన ఏడుపు అణుచుకుందుకు ప్రయత్నించింది. జరిగింది చాలా ఆశ్చర్యంగా అనిపిస్తోంది ఆమెకు. మెత్తగా, చల్లగా తాకిన పూల పొట్లం చేతికి తీసుకుంది. పిసికి పిసిరెయ్యడానికి పిడికిలి బిగుసుకుంది. నలుగుతున్న, నోరు లేని పూలు చేసిన కేకలకు వేళ్ళు సడలి ఝుడిసినట్లు వదిలేశాయి. క్రూరంగా బిగుస్తున్న పిడికిలికి మెత్తని అనుభవ మిస్తూన్న పిచ్చి పూలు! దూరంగా జరిపింది పొట్లాన్ని.

• • •

సత్యవతి చాలా అదృష్టవంతురాలు అన్నారు జనం. నిజమే ననుకుంది తనూ. ఈ జనం దేన్ని అదృష్టం, దేన్ని దురదృష్టం అని పిలుస్తున్నారో అప్పటికి తెలియదు. కొంత కలిగిన కుటుంబంలో పుట్టడం, సమస్యకు కష్టం కలిగించే





everest/281/ACW tl

ఏ అనుభవాలూ ఎదురు కాకుండా శరీరం ఎదగడం, కాలేజీలో చదవడానికి వీలు కలగడం, తండ్రి ముప్పయి వేలు కట్న మిచ్చి అందమైన లాయరు మొగుణ్ణి తేవడం ... తన ప్రమేయం లేకుండా జరిగిన సంఘటనల్నీ తన అదృష్టంగానే జనం అన్నారు. అత్తవారి ఇంటికి పోతున్నప్పుడు రైలు ప్రమాదంలో భర్తను పోగొట్టుకుని తను బతికినప్పుడు తన దురదృష్టం అన్నారు!

సత్యవతి కూర్చోవడానికి ఓపిక లేనట్లు గతం కౌగిలించుకుని బరువుగా వేళ్ళాడి దిగలాగినట్టు పక్క మీదికి ఒరిగింది. ఏడాదిపాటు శరీరాన్నీ, మనస్సునూ ఏలిన అందమైన కల జ్ఞాపకం వస్తూంది. తనమీద జాలిపడుతున్నట్లు కళ్ళు తడి చేసుకుంటున్నాయి. ఆ రైలు ప్రమాదంలో పుట్టబోయే బాబును గురించి ఒక జంట కన్న ఎన్ని కలలు విరిగి పోయాయి! విరిగిన వాటిలో కొన్నయినా అతుక్కోవడానికి వీల్లేకుండా తనవాళ్ళను కున్న వాళ్ళు ఎంత దారుణం చేశారు! తనకు జరిగిన నష్టం సంగతి కొద్ది రోజులకే మరిచిపోయారు వాళ్ళు. తమ లాభం సంగతి తల ఎత్తింది. కాకపోతే 'కర్మ' అన్నారు. రెండక్షరాలూ, చిన్న నిట్టూర్పూ!

'మగడు పోయిన తర్వాత వయసులో ఉన్న పిల్ల అత్తవారి ఇంట్లో ఉండట మెందుకు? మిగిలిన బతుకు తలిదండ్రుల దగ్గరే గడుపుతుంది. అదీ మగవాడే అనుకుంటాం. కన్నవారి ఇంట్లో ఉన్నట్లు అత్తవారి ఇంట్లో ఎట్లా ఉంటుంది?' ఇది తలిదండ్రుల వాదన.

'మా అబ్బాయి పోయినా మా కోడలే గదా? అందునా మాకు వారసు డుండి, పుట్టింటి కంపితే జనం ఏమనుకుంటారు? మా వాడి ఆత్మ ఎంత బాధ పడుతుంది!' ఇది అత్తామామ తరపు వాదన. ఇరుపక్కాలా తన మీద అభిమాన మున్నందుకు కొంచెం ఓదార్పు కలిగింది మొదట. అటు వాళ్ళు ఇటు వాళ్ళమీదా, ఇటు వాళ్ళు అటువాళ్ళ మీదా తన ముందు చేసుకుంటున్న ఆరోపణలు వింటూంటే తన అభిప్రాయం తప్పని అర్థమైంది. తను ఎటువేపున్నా తన ఖర్చెంత? తన పిడికెడు అన్నమూ, తన పెరిగే కొడుకూ! తనకు చాలా ఏళ్ళదాకా చాకిరీ చేసిపెట్టే వయస్సుంటుంది. తనెటువేపుంటే తన కట్నం డబ్బు అటుంటుంది. ఆ మొత్తానికి నాలుగైదు వందలు వడ్డీ వస్తుంది. ఈ జమా ఖర్చు తప్ప తను కాదు ముఖ్యం. తల్లీ, తండ్రీ కూడా అట్లా ఆలోచించడం చాలా బాధ కలిగించింది. అందుకు వాళ్ళు చెప్పేదేమిటి? 'నిజమే ... నీకు చాలా నష్టం జరిగింది. అది విధికృతం. అందు




కేమిచేస్తారు? ఆ నష్టానికి తోడు నీ కొడుకు భవిష్యత్తుకి కూడా నష్టం కలగకుండా కనీసం జాగ్రత్త పడద్దూ! అందుకే నీ కట్నం డబ్బు తీసుకుని ఇక్కడికే రా. కొడుకే పోయిన తర్వాత మీ మామ మనమణ్ణి పట్టుకుంటూ డని నమ్మక మేమిటి? అబ్బో! ... లోకంలో ఎన్నో మోసాలు! అందుచేత నువ్వు డబ్బు రాబట్టుకుని రా. లేకపోతే కోర్టుకెక్కుదాం!'

'మీ తండ్రి ఇప్పుడు ఆర్థికంగా దెబ్బతిన్నాడు. ఈ డబ్బు నీ కొడుక్కు నిలబెట్ట లేడు. నా మాట విను. మీ నాన్న మాట విని చెడిపోకు. నువ్వు కావాలంటే చెప్పు, అబ్బాయి మేజ రయ్యేటప్పటికి అసలూ, వడ్డీ అందేట్లు లాయరుచేత రాయిస్తాను. కొడుకు పోయినాడు, ఇంక నువ్వే నా పెద్ద కొడుకువు!' ఇది మామ మాట!

అన్నట్లు జరగదని ఆ మాట చాటుగా అర్థం చెబుతూనే ఉంది. ఆ లౌకికం తనకు వాళ్ళే నేర్పారు. ఇరవై, ఇరవై రెండేళ్ళ వయస్సులో తను విధవ అయింది. తన ముందు పరవళ్ళు తొక్కుతూ, కెరటాలతో ముంచెత్తుతూన్న యౌవన సముద్ర ముంది. దాని సంగతి మరిచిపోయినారు వాళ్ళు. అంతేకాదు, తను ఆడదన్న సంగతే మరిచిపో దలుచుకున్నారు వాళ్ళు. అందుకే తండ్రి తననుకొడుకనుకుంటా నంటాడు; మామా కొడుకే ననుకుంటా నంటాడు. తాను స్త్రీ అన్న ఇంత గొప్ప సత్యం మరిచిన మనుషులు తన కట్నం డబ్బును మాత్రం జ్ఞాపకం పెట్టుకుంటున్నారు. వాళ్ళు తనను మరిచిపోతారు కానీ, తనను తాను మరిచిపోలేదు. అందువల్లనే అన్ ట్రెయిన్డ్ టీచర్గా తాత్కాలికంగా నయినా వచ్చి ఈ ప్రైవేట్ స్కూల్లో చేరింది. ఇప్పటికీ వాళ్ళు తనను పట్టించుకోకుండా డబ్బు గురించే ఘర్షణ పడుతున్నారు. ఆడదాన్ని మగవా డనుకోగలిగిన వాళ్ళు అసలు లేదనుకోలేరా? ఇదంతా చంద్రకు తెలియదా? అప్పుడతను లేదు- హౌస్ సర్జన్ పూర్తి చేస్తున్నా డనుకో. ఎవరూ అని ఉండరా? తెలిసే ఇప్పుడిట్లా, ఒంటిగా చిక్కించుకుని...ఛీ ఛీ! చంద్రలో ఈ కోరిక మొదట్నించీ ఉండేదా ఏం? — సత్యవతి ఆలోచన అటువైపు ఆధారాలు వెతుకుతూంది. తనకు సాహిత్యమంటే చాలా ఇష్టం. రఘుకు దాని సంగతే తెలియదు. చంద్రకు అందులో మంచి అభిరుచి ఉంది. అందువల్ల గంటలకొద్దీ ఆ ప్రసంగంలో పడేవాళ్ళు చంద్రా, తనూ. రఘూ, చంద్రా అన్నదమ్ముల్లా కాక స్నేహితుల్లా ఉండేవారు.

'రే ... చంద్రా! ఈవేళటికి మీ సాహిత్యం మడిచి పెట్టి మా వదిన్ని పంపుదూ?' అని గదిలోనించి కేకేసేవాడు రఘు.

'పోవమ్మా, పో. పాపం! మా ఆయన విరహంతో చంద్రదూషణ సాగిస్తున్నాడు' అనే వాడు చంద్ర నవ్వుతూ.

రఘూ—'మా వదినే' అన్నప్పుడల్లా 'నాకంటే చిన్నది వదినేమిటి?' అనేవాడు.

'అన్న భార్య చిన్నదైనా వదినే అవుతుంది' అంటే—

'వదినా లేదూ, పుదీనా లేదూ, పోరా. నీ భార్య నాకు సాహిత్య స్నేహితురాలు. సత్యవతి అంటాడు. నన్ను చంద్రా అంటుంది.'

'అంత పెద్ద మగవాడు వదినా అంటే నాకూ బిడియంగానే ఉంటుందిలే' అంటుంది తను. ఇట్లా ఆలోచిస్తుంటే తన మీద మొదట్నించీ ... అప్పుడు తను తెలుసుకోలేకపోయిందే! ఎన్నో నిజాలు తమ పాత్ర వచ్చినప్పుడు బయట పడి మనిషిని పరిచయం చేసుకుంటుంటాయేమో! ఎక్కడున్నా విందాకా? అంటే ... ఇక్కడే ఈ పక్కన ... పరదా చాటున! అంటుందేమో? రఘుతో తన దాంపత్యం విలవలేదు. చంద్రతో తన స్నేహమూ స్వప్నంగా విలవలేదు, ఎప్పుడన్నా ఊహామాత్రంగా నన్నా ఓదార్పు ఇవ్వడానికి. చంద్ర ఇంత చవకబారుగా తనను ఊహించడానికి కారణ మేమిటి? మళ్ళా ఆమెలో ఉద్వేగం పెరిగింది. వెక్కిళ్ళతో ఏడ్పు ఉబికి వచ్చింది.

"సత్యవతీ!" మృదువైన పిలుపు. అయినా, పిడుగు పడినట్లుగా బెదిరింది. కళ్ళమీద కప్పుకున్న చేయి తీసి భీతంగా కళ్ళు చించుకుని చూసింది. రెండడుగులు ముందు కేశాడు. గబుక్కున లేచి, వంటింట్లోకి దూరి తలుపేసుకోవడానికి ప్రయత్నించింది. ఒక్క అంగలో దూకి అడ్డుగా నిలిచాడు గుమ్మంలో.

భయంతో తెల్లబోయి నిలుచుంది సత్యవతి. వెంటనే వెనక్కి పరుగెత్తాలనుకుంది.

"సత్యవతీ! ఆగు. నే చెప్పే మాట విను. నేను సినిమా విలన్లా కనిపిస్తున్నానా నీకు?"

ఆ అడిగిన తీరు కమ్ముకోబోతున్న పిచ్చి విచ్చిపోయేట్లు చెళ్ళున చరిచినట్లయింది. ఎదురుగా వచ్చి నిలుచున్నాడు. ఆ ముఖంలో భయపెట్టే లక్షణా లేమీ లేవు. ఇంతకుముందు 'ఇవి నీకు తెచ్చాను, సత్యవతీ!' అంటున్నప్పటి ముఖం అది. చూస్తూంది.

'నేను పొరపాటు చేశాను. చెప్ప దలుచుకున్న దాన్ని మాటగా, నిర్వచనంగా తెలియజేస్తుందని పూల పొట్లం తెచ్చాను. ను వ్విట్లా అభిప్రాయ పడటంలో నీ

తప్పు లేదు. ఈ మార్గం నే నాలోచించి నిర్ణయించుకున్నదే గానీ, నీ ఆలోచన నిలిపింది కాదు. ఆ సంగతి నీ భయం చూసిన తరవాత అర్థమైంది. తెలివి తక్కువగా ఏ పనిమానివేస్తా ననుకోలేదు.'

ఎగిసిపడే హృదయంతో వింటూంది ఆమె. తనుమాత్రం తెలివి తక్కువది కాదూ? తనూ అతన్ని అనుమానించింది. మరయితే ...

'ఇప్పుడు కూడా చెప్పదలుచుకున్నది ఒక్క నిమిషంలో చెప్పేస్తాను. మీ వాళ్ళూ, మావాళ్ళూ నీ కిచ్చిన చేదు అనుభవాన్ని స్నేహితుడు కొంతకాలం కిందటే చెప్పాడు. సానుభూతి కన పరచడం మాత్రమే నేను చెయ్యా లనుకోవడం లేదు. ఇప్పటికి నా అభిప్రాయం నీతో చెప్పడానికైనా అర్హత సంపాదించాను. మా నాన్న పెద్దకొడుక్కు వచ్చిన కట్నం దాచుకున్నాడు. కోడల్ని విడిచిపెట్టాడు. మీ నాన్న కూతురు జీవితం కంటే ఆమె పెళ్ళి కిచ్చిన కట్నం డబ్బును గురించి బెంగపెట్టుకున్నాడు. ఈ పరిస్థితి మన పెళ్ళికి కావలసినంత ప్రాముఖ్య మిస్తున్నది. ఇక్కడికి దగ్గర్లో గొల్లపల్లి అనే ఊళ్ళో నాకు ఉద్యోగ మొచ్చింది. తెల్లవారురఝామున నాకు ట్రెయినుంది. అయితే, నే నిప్పుడే వెళ్ళి స్టేషన్‌లోనే పడుకుంటాను. నువ్వు భయపడవలసిన పనిలేదు. నీ అభిప్రాయం తెలుసుకోవడానికి తిరిగి మరునాడు ఉదయం మాత్రం వస్తాను.'

మెదడు గూడులో ఉక్కిరి బిక్కిరిగా దూరే ఆలోచనల్ని క్రమపద్ధతిలో సర్దు కోవడానికి ఆమె శ్రమపడుతూండగానే అతను వెళ్ళిపోయాడు.

● ● ●

సత్యవతి ప్రశ్నలు, అనుమానాలు, భయాలు తలుచుకునేకొద్దీ నవ్వు వస్తూంది చంద్రకు.

"రఘూ అంటే అంత ప్రేమ ఉండేది కదా నీకు? లప్పనిపించదూ?" అంటుంది బేలగా.

"అంత ప్రేమ ఉంది గనకనే ..." అన్నాడు స్థిరంగా.

"అతణ్ణి నే నింకా మరిచిపోలేదు. ఎప్పుడన్నా ... ఎప్పుడన్నా ..."

"నువ్వు చెప్పేది అర్థమైంది నాకు. నువ్వు చెప్పేది నీకు అర్థమైందో, లేదో తెలియదు."

"అంటే!"

"అంటేనా? నాకు హృదయం ఉండ టంలో నీ కేమీ అభ్యంతరం లేదుగా అనడుగుతున్నావు. ఎంత హీనమైన అభ్యర్థనో ఆలోచించు."

"ఇప్పు డలాగే ఉండచ్చు."




"ఎప్పటికీ ఇట్లాగే ఉండవచ్చు. నీ మనస్సుతో, నీతో కలిసి నా మనస్సూ, నాతో కలిసి మనం బతికపోతున్నాము."

"వదినె తల్లితో సమానమని ఒకసారి రఘూ అన్నాడు—జ్ఞాపకముందా?"

'ఉంది. నా దుంటే అలాగే ఉండేది. ఒక స్త్రీని సోదరులంతా భార్యగా చేసుకున్నారొకప్పుడు సమాజంలో. అన్నా, చెల్లెలూ పెళ్ళిళ్ళు చేసుకున్నారు. సమాజం ఆరోగ్యంగా ఉండటంకోసం కొన్ని ఆధారాలు మారాలి గనక మార తాయి. వాటికి సెంటిమెంట్స్ జోడించి చూడకూడదు.'

"మన పెళ్ళి సమాజం ఆరోగ్యం ఎట్లా చక్కపరుస్తుంది?"

"చక్కపరచడానికి తోడ్పడుతుంది, పరమాణువంత. మీవాళ్ళూ, మావాళ్ళూ డబ్బు వ్యవస్థకు మచ్చుకు నిలిచారను కుందాం. నా ద్వారా వచ్చే కట్నం మీద కలలు కంటూ కూర్చున్న మా నాన్నకు కనువిప్పు. వయస్సులో ఉన్న నువ్వు మళ్ళా ఇల్లాలు గావడంతో నీ ఆరోగ్యమూ, సమాజం ఆరోగ్యం కూడా కాపాడబడి నట్లే కదా! మనమిట్లా సిగ్గుపడట మెందుకు? రక్తమాంసా లున్నాయని గుర్తించిన మనిషే సమాజానికి మేలు చేయగలుగుతాడు."

"కేవలం సమాజాన్ని మారుస్తున్నా మని చేసుకున్న పెళ్ళిళ్ళు, తర్వాత నిలవ నట్లు సాహిత్యంలోనూ, ప్రపంచంలోనూ చాలా ఉదాహరణ లున్నాయి మరి."

'సత్యవతీ! బయటనుంచి ఉదాహర ణలు తీసుకోవడం మొదలుపెడితే ఏ వైపు చూస్తే ఆ వైపు [illegible]. అప్పు [illegible] పెళ్ళికేము. సమాజం దృష్టితో [illegible] వ్యక్తిగత సంబంధా లతో చేసుకుంటున్న పెళ్ళిళ్ళు చెడటం లేదా? అంత గొప్ప అంశమైన సమాజమే పెళ్ళిళ్ళలో నిలవకపోతే వ్యక్తిగత కార ణాలు మాత్రం నిలుస్తాయా? ఇంతకూ సమాజమంటే మన కెక్కడో దూరాన ఉందా? మన శరీరం, మనస్సూ సమా జమే! సమాజమూ ఉంది, వ్యక్తీ ఉంది. ఈ రెండిట్లో ఏ ఒక్కదానికీ ఎక్కువ ప్రాముఖ్యం ఇవ్వకపోవడంలోనే రెండో దాని ప్రాముఖ్య ముంది. సత్యవతీ! ఇవి మన మొన్నసార్లు మాట్లాడుకున్నవే. నన్ను ఉపన్యాసకుణ్ణి చేయకు. ఆలోచిస్తే నీకూ తెలుస్తుంది.'

ఆమె మనస్సు ఆలోచించే స్తిమితం ఇవ్వడం లేదు. చిన్న చిన్న సందేహాలకు కూడా ఆమెకు చంద్ర సహాయం కావలసి వస్తూంది. అచ్చం సందేహాలు కావవి. ఆమెను ఇంకా భయపెట్టే సంప్రదా యాలు, సెంటిమెంట్స్!

'వాళ్ళ నెట్లా చూసేది? ఏమను కుంటారు నన్ను?' అంటుంది బిడి యంగా.

'ఎట్లా చూస్తావు? మామూలుగానే. ని న్నేమనుకుంటారు? కోడ లను కుంటారు. కొత్త ఏం? అనుకోకపోతే నేను కొత్తగా నా భార్య అనుకుం టాను. అక్కడికి పోవడ మెందుకంటే— 'నాన్నా! వాళ్ళమ్మగారి డబ్బు మా అబ్బాయి కిచ్చెయ్యి' అని చెప్పద్దూ?'

అంతటితో ఆమెకు అబ్బాయిని గురించిన భయం మొలకెత్తింది. వాడు పెద్దయితే తల్లిని గురించి తెలుసు కుంటే ... తన తండ్రి అతను కాదని తెలుసుకుంటే...! అదీ అడుగుతుంది, పాపం! తల్లి.

'సత్యవతీ! భవిష్యత్ మానవుడి మీద, నీ శిక్షణ మీద నమ్మక ముంచుకో. అంతకంటే మానవ సంబంధాల్లో ఏది మాత్రం బలమైంది?' ఆ సమాధానాన్ని అంగీకరించింది కాబోలు సత్యవతి, ఊరికే కూర్చుంది.

"పుట్టింటికా, అత్తింటికా?" ఎవరో పెద్దామె అడుగుతూంది సత్యవతిని. చుట్టూ చూస్తున్న కళ్ళలో వాళ్ళి ద్దరూ దంపతులన్న గుర్తింపు కనిపి స్తూంది. ఆమె మళ్ళా అదే ప్రశ్న అడుగుతూంది. లోపలి ప్రశ్నలతో అల్లాడిపోతున్న సత్యవతికి బయట ప్రశ్నలు కూడా! "మా ఇంటికి" అన్నాడు చంద్ర. ఆ పెద్దామె సంతోషించింది. చంద్ర ఒడిలో బాబు ఉక్క వల్ల ఏడు స్తున్నాడు. అతని దగ్గర్నుంచీ బాబును అందుకుంటూంటే కొత్త అనుభవం ఆమెను చల్లగాలిలా తాకు తూంది. తువ్వాలు పరిచి బాబును పడుకోబెట్టడంలో సత్యవతి చంద్రకు దగ్గరగా జరిగింది. వీళ్ళిద్దర్నీ గురించిన ఆసక్తి తగ్గిపోయినట్లు జనం వాళ్ళ వాళ్ళ స్వంత విషయాల్లోకి సర్దుకున్నారు. కొందరు కళ్ళు మూసుకుని తూగు తున్నారు.

వాళ్ళిద్దరూ చెరో వైపు చూస్తు న్నారు. పొలాలు, గుట్టలు, చెట్లు, మనుషులు, ఎలెక్ట్రిక్ తీగెలు, తీగెల మీద వాలిన పిట్టలు...అన్నీ ఒకే వేగంతో తప్పుకోవడం తమాషాగా ఉంది. ఇద్దరి శరీరాలూ స్పర్శించుకుంటున్నాయి. ఆమెలో లేచే చాలా ప్రశ్నల అలలు అణుగుతున్న ట్లున్నాయి. అతడి చేయి చుట్టులో ఒదిగి, భుజం మీద ఒరిగింది. కళ్ళలో ప్రశ్న కనిపించడం కాదుగానీ, జ్ఞాపకాల తడి ఊరుతూంది.

"ఇంకా ఏమిటి?" అన్నాడు మెత్తగా వత్తుకుంటూ చిరునవ్వుతో. ఒక్క సారిగా చెప్పలేకపోయింది. ఆగి ... ఆగి ... ఆలుపు తీర్చుకుంటున్నట్లుగా అంది. సన్నగా అన్నా అతని కర్థమైంది. అతని భుజం మీద ఆమె కన్నీటి చుక్కలు తూటాల్లా దిగినాయి.

"ఆ అనుభవాన్ని అట్లాకాక ఇంకో రకంగా చూడు. ఈ దారిలో ఆ రోజు రైలు పట్టాలు తప్పిపోయింది. రఘూ చనిపోయాడు. చాలా మంది చనిపో యారు. అందుకని ఈ దారిని రైలు రావడం మానుకోవాలా? అట్లా ఆపేస్తే, బతుకుతూన్న వాళ్ళ కెంతమందికి ఎంత ఇబ్బంది!"

ఆ మాట దేని కన్వయిస్తూందో అర్థమైంది సత్యవతికి. ★